క్లుప్తంగా

ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ సభ



నకరికల్లు: సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలను ప్రత్యేక యాప్ ద్వారా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏపీ శాప్ డీఆర్పీ శరత్ కుమార్ అన్నారు. మండలంలోని దేవవరం గ్రామంలో గల ఆదర్శపాఠశాలలో సామాజిక తనిఖీ గ్రామసభను బుధవారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికతనిఖీలో గుర్తించిన అంశాలను తల్లిదండ్రులకు వివరించి, బోధనా సిబ్బంది విధానాలపై కూడా తల్లిదండ్రులతో చర్చించి యాప్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకతీయ జనసేవా సమితి అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



సత్తెనపల్లి: కాకతీయ జనసేన సమితి అధ్యక్షుడిగా దరువూరి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 27న జరగవలసిన ఎన్నికల ప్రక్రియకు అన్ని పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే వచ్చినందున ఎటువంటి పోటీ లేకపోవడంతో కార్యవర్గాన్ని ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన రావిపాటి నరసింహారావు, గద్దె మురహరి రావులు బుధవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా పచ్చా సంజీవరావు, బోయపాటి పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మక్కెన అచ్చయ్య, సంయుక్త కార్యదర్శు లుగా ముంద్రా వెంకట కామేశ్వరరావు, యెల్లినేడి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా గుంటిపల్లి రోశయ్యలు ఎన్నికైనట్లు తెలిపారు.

కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలిద్దాం



పెరికపాడు(క్రోసూరు): మండలంలోని పెరికపాడు గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీ జరిగింది. ఫిబ్రవరి 2 తేదీ వరకు ఇంటింటికీ వచ్చి కుష్టువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి నమోదు చేసుకోవటం జరుగుతుందని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అమీర్, ఆరోగ్య కార్యకర్త మల్లీశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

బకాయిలు వెంటనే విడుదల చేయాలి



నరసరావుపేట: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పే రివిజన్ కమిషన్ నేటికీ నియమించకపోవడంతో 18 నెలల కాలాన్ని కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా గత 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు రూ.7,384 కోట్లు, డీఏ బకాయిలు రూ.9,650 కోట్లు, ఎంప్లాయి సరెండర్ లీవ్ రూ.2,250కోట్లు, సీపీఎస్ ఎంప్లాయిస్ బకాయిలు 2500 కోట్లు, ఏపీ జీఎల్ఐ రూ.950కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్‌ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించి పాత పెన్షన్ విధానాన్ని అమలుపర్చాలని కోరారు. ఐఆర్ 30శాతం వెంటనే ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రవి, జిల్లా కార్యదర్శులు టి.వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ లింగయ్య, రాష్ట్ర కుటుంబ సంక్షేమ ఆడిటర్ ప్రేమ్‌కుమార్, నరసరావుపేట మండలం, పట్టణ ప్రధాన కార్యదర్శులు సత్యానందరావు, వెంకటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

నేడు కనపర్రు చర్చిలో నిశ్చితార్థ మహోత్సవం

నాదెండ్ల: కనపర్రులోని పురాతన ఆర్‌సీఎం చర్చిలో గురువారం పునీత మరియ జోజప్పల కల్యాణ నిశ్చితార్థ మహోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య, వివిధ ప్రాంతాల మత గురువులు హాజరుకానున్నారు. ఉదయం 5.30 గంటలకు మొదటి పూజ, 10 గంటలకు సమిష్టి పూజాబలి నిర్వహించనున్నారు.

ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- విజృంభిస్తున్న దోమలు.. ప్రబలుతున్న వ్యాధులు
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్', 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్'
- నియోజకవర్గాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు

రహదారి అంచులే డంపింగ్‌యార్డులు



ఖాళీ కొబ్బరిబొండాలతో నిండిన పట్టణంలోని మాచర్ల రోడ్డు మార్జిన్

సత్తెనపల్లి: పట్టణం .. పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. శివారు రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారుల అంచులనే మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. నియోజకవర్గంలోని పట్టణంతోపాటు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న చెత్త గుట్టలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. రోడ్ల మార్జిన్‌లోనే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రకటనలకు సంబంధించిన భారీ కటౌట్లు, బ్యానర్లు పెడుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

చెత్తకు నిప్పు పెట్టడంతో...

అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చెత్త కుప్పలకు నిప్పు పెట్టి వదిలివేయడంతో తడిగా ఉండటంతో వీటినుంచి వచ్చే పొగతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల వద్ద చెత్త కుప్పలు ప్రమాదాలకు నిలయలుగా మారాయి. దోమలు విజృంభించి వ్యాధులు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' పేరుతో చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల పరిధిలోని పట్టణంలోని వార్డులు, మండలాల్లోని గ్రామాల్లో వీధులు డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.



పట్టణంలోని భీమవరం డొంకలో పేరుకుపోయిన చెత్త

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే...

కొడమోడు – పేరేచర్ల జాతీయ రహదారి ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కాఫీ, భోజనం హోటళ్ళు వంటి వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం చెత్తను పట్టుకొని వచ్చి రోడ్డు పక్కన వేస్తున్నారు. అంతేకాకుండా నిల్వ పదార్థాలను ఇక్కడే వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్ల, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. మున్సిపల్ అధికారులు అప్పుడప్పుడు చెత్తను తొలగిస్తున్నా ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని వాపోతున్నారు. ఈ రహదారి ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం అగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు ఈ చెత్త నుంచి వచ్చే చెడు వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

పింఛన్‌దారుల వివరాలు సేకరణ



రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో మంచానికే పరిమితమై పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల వివరాలను అధికారులు, వైద్యులు బుధవారం పరిశీలించారు. మండలంలో 30 మంది నడవలేని స్థితిలో ఉండి మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించారు. వారి ఆధార్‌కార్డులు, పింఛన్‌కార్డులు, సదరన్ సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనుమానం వచ్చిన చోట కొంతమంది లబ్ధిదారులను కోరారు. మండలంలో రెండు బృందాలు ఏర్పడి పరిశీలన చేశారు. వారి వెంట ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, డాక్టర్ కృష్ణకుమార్, ఏపీఎం శివకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రామభువర శతకం గ్రంథావిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి రోడ్‌లో గల ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 24న ఉదయం 10:30 గంటలకు రామభువర శతకం గ్రంథావిష్కరణ సభ జరుగుతుందని నిర్వాహకులు గుండ్లపల్లి రామచంద్రశేఖర్, గిరిజ బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పాద పద్మములకు అంకితంగా గుండ్లపల్లి వెంకట హనుమంతరావు రచించిన రామ భువర శతకం గ్రంథావిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా నిలబడతానని, వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. కూటమి నేతల ప్రోద్బలం, పోలీసుల బెదిరింపులకు తీరుకు నిరసనగా ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన కొర్లకుంట నాగమల్లేశ్వరరావు చిత్రపటానికి బుధవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెంటపాళ్ల గ్రామంలోని నాగమల్లేశ్వరరావు గృహాన్ని సందర్శించి మృతుడి తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో జరిగిన తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుదీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు తహతహలాడుతున్నారన్నారు. ప్రస్తుత పాలనలో ఆయన అవసరం ప్రజలకు తెలి సిందన్నారు. తొలుత కొర్లకుంట వెంకటేశ్వర్లుతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సంఘం సలహాదారుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, రెంటపాళ్ల సర్పంచ్ ఏకుల మనీషా, ఎంపీటీసీ సక్క పద్మ, నాయకులు ఏకుల మత్తయ్య, పల్లె గాబ్రియేల్, చల్లా శ్రీను, కొమెర శివశంకర్, కొమెర వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



కొర్లకుంట నాగమల్లేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

మండెపూడిలో పశు వైద్యశిబిరం

అమరావతి: మండలంలోని మండెపూడి గ్రామంలో బుధవారం పశు వైద్య ఆరోగ్య శిబిరాన్ని పల్నాడు జిల్లా ఏహెచ్ డిప్యూటీ డైరక్టర్ రామారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 45 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించి 20 పశువులకు ఎద ఇంజక్షన్‌లు చేశారు. 25 పశువులకు చూడి పరీక్షలు, 70దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 20 జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ వెంకటరామయ్య, పశు వైద్యాధికారి టి.ప్రభావతి వైద్యపరీక్షలు నిర్వహించారు. పాడిరైతులు, పశువైద్య సిబ్బంది, గొర్రెల పెంపకం దారులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

గణపవరంలో...

రాజుపాలెం: మండలంలోని గణపవరంలో పశు వైద్య శిబిరం బుధవారం జరిగింది. పశువైద్యాధికారి శివకుమారి 21 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 15 పశువులకు చూడి పరీక్షలు, 37 పశువులకు 42 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ, 95 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ, 150 గొర్రెలకు బొబ్బా టీకాలు వేసినట్లు తెలిపారు. పశువైద్య సిబ్బంది అఖిల, జగన్మోహన్ రావు, రాజేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఇరుకుపాలెంలోని శిబిరాన్ని మాజీ సర్పంచ్ బత్తుల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆయా శిబిరాల్లో మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. మొత్తం 41 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. 324 పశువులకు నట్టల నివారణ మందు అందించామన్నారు. 330 గొర్రెలకు నట్టలనివారణ మందు, 200 గొర్రెలకు బొబ్బర టీకాలు అందించామన్నారు.

పెదపాలెంలో...

అచ్చంపేట: వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, పాలదిగుబడులు పెంచుకోవాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్వాతి దేవి తెలిపారు. మండలంలోని పెదపాలెంలో బుధవారం జరిగిన పశువైద్యశిబిరంలో ఆమె పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులనుద్దేశించి మాట్లాడారు. 100 పశువులకు, 50 దూడలకు వ్యాధినివారణ వ్యాక్సిన్ చేశారు. 1500 జీవాలకు నట్టనల నివారణ మందులు పంపిణీ చేశారు. 20 పశువులకు సాధారణ, గర్భకోస వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేశారు.



మండెపూడిలో నట్టల నివారణ మందు వేస్తున్న పల్నాడు జిల్లా పశు సంవర్ధక డీడీ రామారావు

అందుకూరులో లేగదూడల ప్రదర్శన..

అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు గ్రామంలో గురువారం పశు ఆరోగ్యశిబిరంతో పాటుగా, లేగదూడల ప్రదర్శన జరిగిందని మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలియచేసారు. లేగదూడల ప్రదర్శన అనంతరం ఆరోగ్యకరమైన దూడలకు సంబంధించిన రైతులకు బహుమతులు అందచేసినట్లు తెలిపారు. లేగదూడల ప్రదర్శనలో మొదటి బహుమతి వాసిరెడ్డి సురేష్, ద్వితీయ బహుమతి దంతమాల పున్నారావు, తృతీయ బహుమతి దిగుమర్తి తిరుమలరావు, ఒంగోలు జాతి దూడలలో శీలంనేని లక్ష్మీనారాయణకు బహుమతులు అందచేసినట్లు చెప్పారు. ఆరోగ్యశిబిరంలో మొత్తం 371 పశువులు, జీవాలకు చికిత్స అందచేయగా వాటిలో 34 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 137 పశువుల, దూడలలో నట్టలనివారణ మందులు వేయటం జరిగింది. 100 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కాంతారావు, నరసారావుపేట డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ రామరావు, పెదకూరపాడు ఏడీ డాక్టర్ శివసారధిబాబు, చేబ్రోలు వైద్యులు డాక్టర్ చలపతి, మక్కపాడు వైద్యులు డాక్టర్ కె.నాగేశ్వరరావు , గ్రామసర్పంచ్ జంగా సౌభాగ్యలక్ష్మీ, టీడీపీ నాయకులు, సిబ్బంది ఇంద్రాణి, రామారావు, పశుపోషకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

అమరావతి: ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల సమన్వయంతో మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మండల పరిధి గ్రామాలలో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మేకల హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలు పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్తుకు జాప్యం లేకుండా వెంటనే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. సొంతస్థలాల్లో ఇళ్ళ నిర్మాణానికి దరకాస్తు చేసుకునేవాళ్లు సచివాలయంలో సంప్రదించాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు అళ్ళ శివలక్ష్మీకుమారి, మంగిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీఓ మాధవిలతో పాటుగా మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

కాల్వలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

ముప్పాళ్ళ: తీవ్ర ఆరోగ్య సమస్యతో బాధపడుతూ వృద్ధురాలు కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని పెదనందిపాడు బ్రాంచ్‌కాలువ వద్ద బుధవారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ యు.సోమేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేటకు చెందిన పోతంశెట్టి సీతారావమ్మ అనే వృద్ధురాలు చాగంటివారిపాలెం గ్రామంలోని సమీపంలోని దగ్గర బంధువు ఇంటికి వచ్చింది. తలలోని రక్తనాళాలు దెబ్బతిని అనారోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో చనిపోవాలని నిర్ణయించుకొని కాల్వలోకి దూకింది. గమనించిన స్థానికులు కేకలు వేయటంతో పక్కనే ఉన్న మెకానిక్‌షాపులోని పఠాన్ ఫిరోజ్ అనే యువకుడు కాల్వలోకి దూకి వృద్ధురాలిని బయటకు తీసుకొచ్చాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్‌ఐ యు.సోమేశ్వరరావు, సిబ్బంది సాయంతో వృద్ధురాలిని బయటకు తెచ్చి, కుటుంబసభ్యుల వివరాలు అడిగి వారిని పిలిపించారు. స్థానిక వైద్యశాలలో వైద్య సేవలు అందించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వృద్ధురాలిని కాపాడిన ఫిరోజ్‌ను స్థానికులు అభినందించారు.



వృద్ధురాలిని బయటకు తీసుకువస్తున్న ఎస్‌ఐ యు.సోమేశ్వరరావు

అక్షరాస్యతతోనే మహిళాభివృద్ధి సాధ్యం



వినుకొండ(నూజెండ్ల): అక్షరాస్యతతోనే మహిళా అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షర వెలుగు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ చిన్నతనంలో చదువుకోని 15 సంవత్సరాల నిండిన మహిళలను అక్షరాస్యులను చేసి జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలంతా అక్షరాస్యులుగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి యానిమేటరు వలంటీరుగా బాధ్యతలు చేపట్టి, వారి గ్రూపులోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను మార్చాలని తెలిపారు. అనంతరం ఉల్లాస్ అవగాహన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్త్రీనిధి జిల్లా మేనేజర్ చిన బుల్లెయ్య, ఏపీఎం రామాంజనేయులు, మండల సమాఖ్యా అధ్యక్షురాలు గుంటుపల్లి సుజాత, సీసీలు కొండలు,వెంకటరావు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు ఇవ్వండి

విద్యుత్ లోక్ అదాలత్‌లో ఐదు గ్రామాల రైతులు విన్నపం

అచ్చంపేట: వ్యవసాయ విద్యుత్ కనక్షన్ల కోసం యేడాదిగా ఎదురు చూస్తున్నాం.. స్తంభాలుకే పరిమితమయ్యారు. తీగలులాగి, ట్రాన్స్‌ఫార్మర్స్ బిగించి కనక్షన్లు ఇవ్వండి మహాప్రభో అని రైతులు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నారు. సత్తెనపల్లి మండలంలోని కొండమోడులో బుధవారం జరిగిన మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ విక్టర్ ఎన్.ఇమ్మానియేలు, పల్నాడు జిల్లా ఎస్ఈ పత్తిపాటి విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సులో అచ్చంపేట మండలానికి చెందిన నీలేశ్వరపాలెం, చామర్రు, పెదపాలెం, కొండూరు, నిండుజర్ల గ్రామాల రైతులు హాజరయ్యారు. తాము గత యేడాది మార్చిలో విద్యుత్ కనక్షన్లకు దరఖాస్తు చేసుకున్నామని, ఇంతవరకు ఎస్టిమేషన్లు వేయలేదని కొందరు రైతులు, ఎస్టిమేషన్లు వేసి, డబ్బులు చెల్లించినా ఇంతవరకు కనక్షన్లు ఇవ్వలేదని మరికొందరు రైతులు ఫిర్యాదు చేశారు. గత జూన్‌నెలలో విద్యుత్ స్తంభాలు వేశారని, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సంభవించిన భారీవర్షాలు, తుఫానుకు కొన్ని స్తంభాలు పడిపోయాయని రైతులు తెలిపారు. తమకు నాగార్జున సాగర్ కాలువల నుంచి నీళ్లు అందవని, కేవలం వర్షాధారంగా పంటలు పండించుకోవలసిన పరిస్థితులున్నాయన్నారు. విద్యుత్ కనక్షన్లు ఇవ్వకపోవడం వల్ల ఈ యేడాది పత్తి పంటను కోల్పోయామని, సకాలంలో నీళ్లు లేకపోవడంతో మిర్చి పంటకు ఆయిల్ ఇంజిన్లతో సాగునీరు పెట్టుకోవడంతో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయిని, తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తపరచారు. ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనక్షన్ల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించలేదని, అయినా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. రైతులు ఆదూరి వెంకటేశ్వరరావు, ముప్పాశ్రీను, నారాయణ, ఆదినారాయణ, షేక్ ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అదాలత్‌లో అధికారులకు మొరపెట్టుకుంటున్న అచ్చంపేట మండల రైతులు

పంటలకు ఈకేవైసీ తప్పనిసరి

నకరికల్లు: రబీసీజన్‌లో పంటలను సాగుచేస్తున్న రైతులు తప్పనిసరిగా సాగుచేస్తున్న పంటల వివరాలతో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని కుంకలగుంట, జిల్లాపేట తండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. అనంతరం మొక్కజొన్న పంట సాగులో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుడు పి.సాయివెంకట్, రైతులు పాల్గొన్నారు.

నెమలిపురిలో..

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి గ్రామంలోని వరి పొలాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయాధికారులు బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య వరి పైరును పరిశీలించి, పంటలో ఉల్లికోడు పురుగును గుర్తించి, నివారణకు రైతులకు సూచనలు అందజేశారు. వ్యవసాయ సహాయకులు ఎస్కె ముస్తాక్ డి.భవానీ, రైతులు పాల్గొన్నారు.



కుంకలగుంటలో రైతులకు సూచనలిస్తున్న ఏడీ కె.దేవదాసు

రుద్రవరంలో....

రుద్రవరం(ముప్పాళ్ళ): రైతులు పంటలపై ఎరువుల వాడకం తగ్గించేలా యాజమాన్యపద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని రుద్రవరం, తొండపి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఏఈఓలు నీలిమ, జీ.రాజేష్, రైతులు పాల్గొన్నారు.

చింతపల్లిలో...

అచ్చంపేట: మిర్చి పంటలో నల్లతామర తెగులు నివారణకు బునుగురంగు జిగురు అట్టలను ఎకరాకు 25 నుంచి 40వరకు పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు రైతులకు సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపల్లిలో బుధవారం ఆయన మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు అందజేశారు. ఆయన వెంట ఏవో పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనునాయక్, మాన్యనాయక్, రహీం, రైతులు పాల్గొన్నారు.